ప్రశాంత వాతావరణంలో టెన్త్ పరీక్షలు

- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త: టెన్త్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు రాసేలా ఏర్పాట్లు వుండాలని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. చిత్తూరు లోని మున్సిపల్ ఉన్నత పాఠశాల టెన్త్ పరీక్షా కేంద్రం, న్యూయార్క్ ఇంగ్లీషు మీడియం స్కూల్ పరీక్షా కేంద్రాలను బుధవారం ఎస్పీ మణికంఠ చందోలు తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ టెన్త్ పరీక్షలు పక్కా నిర్వహణకు పరీక్షా కేంద్రాల పరి సరాల్లో గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన కనీస వసతులను పక్కాగా కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

మాధవమాలలో విషజ్వరాలు

పరుగులు తీసిన వైద్యసిబ్బంది

వైద్యపరీక్షలు జరుపుతున్న దృశ్యం

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 19 ప్రభాతవార్త ఏర్పేడుమండలం మాధవ మాల, సరస్వతి కండ్రిగ గ్రామాల్లో జనాలు విషజ్వరాలతో తల్లడిల్లుతున్నారు. దాంతో వైద్యసిబ్బంది, మండల ఆరోగ్యశాఖ, పారిశుద్ధ్య శాఖలు గ్రామాలకు పరుగులు తీసారు. బుధవారం సుమారు 30కుటుంబాలకు వైద్యరీక్షలు జరిపారు. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియ జ్వరాల నిరాకరణ కోసం రక్తనమూనాలు తీసుకున్నారు.

వాతావరణం మార్పు: పర్యవేక్షణ లేమి!

గత కొన్ని సంవత్సరాలుగా గ్రామాల్లో పరిపాలనా స్థంభించింది, వాతావరణం మార్పు, పర్యవేక్షణ లేమితో గ్రామాల్లోని ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గ్రామాల్లో సర్పంచ్ లు ఉన్నా పంచాయతీలకు నిధుల కొరతతో అభివృద్ధి మాట దేవుడెరుగు కనీసం క్లోరినేషన్ కూడా జరిపే పరిస్థితి లేక పోయింది. ఇక కాలువలను తీసే పరిస్థితి కూడా కరువైంది. ఈ ఏడాది వాతావరణం అగమ్యమారింది. ఫిబ్రవరి వరకు విపరీతమైన చలి వాతావరణం. జనవరి వరకు వర్షాలతో సతమతం చేసింది. ప్రస్తుతం మార్చిలోనే విపరీతమైన ఎండలతో జనం తల్లడిల్లుతున్నారు. రెండు గ్రామాల్లో వాతావరణ మార్పో లేక నీటి కాలుష్యమో తెలియదు కానీ ఒక్కొక్క ఇ ంటిలో ఇద్దరుముగ్గురు మంచాన పడ్డారు. ఏ మూల చూసినా దుప్పట్లు కప్పుకొని వణుకుతూ మూలుగుతున్న నిరుపేదల ఆక్రనందనలు వినబడుతున్నాయి. రెండు గ్రామాల్లో పరిస్థితి ఆందోళన కరంగా ఉందని తెలియటంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర డాక్టర్లు సిబ్బంది పరుగులు తీసారు. రక్తనమూనాలు తీసారు. ఏ జ్వరాలో తెలుసుకొనుటకు ప్రయత్నిస్తున్నారు. ప్రతి ఒక్కరికి వైద్యపరీక్షలు జరిపారు. పిహెచ్సి వైద్యురాలు డాక్టర్ శివ ప్రియ సారధ్యంలో వైద్య బృందాలు వైద్య పరీక్షలు జరిపారు. ఆమెతో పాటు ఇఓ పిఆర్డి రమణకుమార్, సర్పంచ్ కరీముల్లా, తెలుగు దేశం నాయకులు చంద్రారెడ్డి, రవినాయుడు, ఆశావర్కర్ కృష్ణవేణి, ఎఎన్ఎం పద్మ, సూపర్‌వైజర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆధిపత్యపోరులో నలిగిపోతున్న కీలక నేతలు!

- గుర్తింపులేదంటూ ఆవేదన

ప్రభాతవార్త-తిరుపతి: అధికారంలోకి వచ్చిన తరువాత కూడా తెలుగుదేశం పార్టీలో కొందరు నేతల వ్యవహార శైలితో ప్రజాబలం ఉన్న కీలక నేతలు నలిగిపోతున్నామనే అంతర్మథనం చెందుతున్నారు. పార్టీ పని తీరును, అధినాయకత్వం పలకరింపు, గుర్తింపును పరిశీలించి తెలుగుదేశం పార్టీలో చేరిన కొందరు అభిమానులు పార్టీయే ప్రాణంగా భావించి కార్యక్రమాలకు చేయూతనిస్తున్నా పార్టీ కేడర్ నేతలతో తగిన గుర్తింపులేక కరింపాకులా మారడంతో అసహనం, ఆవేదన వెల్లగక్కుతున్నారు. పార్టీ లోని కొందరు నేతల తీరుతో సీనియర్లు కూడా అసంతృప్తితో ఉండటం పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. 1999 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయధంకా మ్రోగించి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పట్లో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు నాయకత్వంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు పార్టీలో కార్యకర్తలకు కూడా సముచితప్రాధాన్యతనిచ్చి ప్రజల సమస్యలు పరిష్కరించేవారు. ఆ తరువాత 2004 ఎన్నికల్లో టిడిపి ఓటమిచవిచూసింది. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వంతో టిడిపి నేతలు, కార్యకర్తలు భయంతో పార్టీలో కొనసాగి ప్రాణాలుకు త్యజించి పార్టీయే ప్రాణసమానంగా పనిచేశారు. వరుసగా 2009 ఎన్నికల్లోనూ టిడిపి అధికారం చేజిక్కించుకోలేకపోయింది. ఆ పదిసంవత్సరాలు రాష్ట్రంలోనేగాక ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వైద్యవృత్తిలో పేరున్న పలువురు వైద్యులు టిడిపిపార్టీ కండువాలు కప్పుకుని ప్రజాసేవకు వచ్చారు. వైద్యవృత్తిని వదలి వచ్చిన నాయకులకు పార్టీలో సముచిత గుర్తింపునిచ్చి పార్టీ పదవులను కట్టబెట్టారు. పదవుల్లో ఉంటూ అటూ వైద్యవృత్తికి ఇటు ప్రజాసేవకు మరింత కష్టపడ్డారు. ఇదే ఉత్సాహంతో 2014 ఎన్నికల్లో తెలుగుదేశం అనూహ్యంగా విజయకేతనంతో రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసుకుంది. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీ కోసం పనిచేసిన నేతలకు తగిన గుర్తింపు నిచ్చినా , ఇతర పార్టీలనుంచి వచ్చిన వారికి ప్రాధాన్యతనిచ్చారనేది సీనియర్ల అసహనం. . 2009 ఎన్నికలకు ముందే తిరుపతికి చెందిన వైద్యులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, డాక్టర్ రాళ్ళపల్లి సుధారాణి, డాక్టర్ ఆశాలత, డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు రాజకీయ కండువా కప్పుకున్నారు. వీరందరూ టిడిపి పార్టీలో చేరారు. 2014 ప్రభుత్వంలో కూడా వీరికి పెద్దగా ప్రాధాన్యత లభించలేదు. అప్పట్లో ఐదేళ్ళు పార్టీకోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు డాక్టర్ సుధారాణి టిడిపిని వీడారు. ఆమె పార్టీని వీడినా పార్టీలో కీలక నేతలు మంతనాలు కూడా చేయకపోడం కొసమెరుపు. 2024లో మళ్ళీ కూటమి పార్టీల్లో టిడిపి అధికారంలోకి వచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినా పార్టీని ప్రాణంగా నమ్ముకున్న సీనియర్లుకు తగిన గుర్తింపు లేదనే ఆవేదన వెల్లగక్కుతున్నారు.

నేడు తిరుమలకు సిఎం చంద్రబాబు

-భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ పర్యవేక్షణ



తిరుమల, మార్చి 19ప్రభాతవార్తప్రతినిధి: ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు కుటుంబంతో కలసి నేటి సాయంత్రం 6.30గంటలకు తిరుమలకు వస్తున్నారు. మనవడు నారా దేవాన్స్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబసభ్యులు నారాభువనేశ్వరి, కుమారుడు, రాష్ట్రమంత్రి నారాలోకేశ్,

కోడలు నారాబ్రాహ్మణి, మనవడు దేవాన్స్‌తో కలసి శుక్రవారం (రేపు)తమ కులదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకుంటారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంకు చేరుకుని 44లక్షల రూపాయలు విరాళాలందిస్తారు. ఆ రోజంతా దేవాన్స్ పేరున భక్తులకు అన్నదానం చేస్తారు.. ఇందులో స్వయంగా సిఎం చంద్రబాబు కుటుంబం పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వితరణ చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు తిరుమల పద్మావతి అతిథిగృహంలో బసచేయనున్నారు. రేపు తిరుమలలోనే సిఎం టిటిడి అభివృద్ధిపై, తిరుమల విజన్ 2047పై సమావేశమవుతారు. మధ్యాహ్నం తిరుమల నుండి తిరుగుప్రయాణం కానున్నారు. ఈ సందర్భంగా తిరుమల, తిరుపతిలో ముఖ్యమంత్రి భద్రత, బసచేసే చోట్ల ,ఆలయం వద్ద భద్రత విషయాలపై బుధవారం సాయంత్రం తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తనిఖీలు చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, విఎస్ఓ అల్లంసురేంద్రతో కలసి పలు సూచనలు చేశారు.

మహిళలకు ఉచిత బస్సు హామీపై వైసిపి వినూత్న నిరసన

-వైసిపి శ్రేణులు 35మందిపై కేసు నమోదు

తిరుపతిరూరల్, మార్చి19 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక...మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మరిచిందని ఏద్దేవ చేస్తూ బుధవారం తిరుపతిలో వైసిపి నాయకులు వినూత్న నిరసన తెలియజేసారు. తిరుపతి ఆర్టీసి బస్సులో పీలేరుకు వెళ్ళే పల్లె వెలుగు బస్సు ఎక్కిన మహిళలు...కండక్టర్ టిక్కెట్ అడిగితే చంద్రబాబు ఇచ్చిన హామీని చూపగా...ఉచిత బస్సు ప్రమాణం ఇంకా అమలు కాలేదన్నారు. వైసిపి వినూత్న నిరసనపై కండక్టర్ అలిపిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆర్టీసి బస్సును ఎస్వీ యూనివర్శిటీ పోలీసుస్టేషన్‌కు తరలించి, 35మంది వైసిపి మహిళలు, కార్యకర్తలపై కేసు నమోదు చేసారు. ఈ కార్యక్రమంలో తిరుపతి వైసిపి ఇన్‌చార్జి భూమన అభినయ్‌రెడ్డి, నగరపార్టీ అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మెన్ కేతం జయచంద్రారెడ్డి, మహిళా నాయకురాలు గీతా యాదవ్, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

కొళాయిల్లో నీరు వస్తోందా...!

అన్నప్రసాదాలు ఎలా ఉన్నాయి
సాంబారు,రసం రుచి ఉందా
టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి ఆరా

తిరుమల, మార్చి 19ప్రభాతవార్తప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు ముందే తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో సౌకర్యాలు, భక్తులకు వడ్డిస్తున్న అన్నప్రసాదాల విధానాన్ని బుధవారం ఉదయం టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తనిఖీ చేశారు. ఉన్నఫళంగా ఆయన టిటిడి అధికారులతో కలసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇక్కడ చేతులు శుభ్రం చేసుకునే కొళాయిలు పనిచేస్తున్నాయా? నీళ్ళు వస్తున్నాయా అంటూ తనదైన శైలిలో ఆరా తీశారు. స్వయంగా పరిశీలించారు. అంతేగాక అక్కడ శ్రీవారిసేవకులు, టిటిడి సిబ్బంది భక్తులకు వడ్డిస్తున్న అన్నప్రసాదాల తీరును, నాణ్యత, రుచిని అడిగి తెలుసుకున్నారు. అన్నప్రసాదాల నాణ్యత, రుచి కూడా పెరగడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం అన్నప్రసాదం డిప్యూటీ ఈఓ రాజేంద్ర, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, విఎస్ఓలు ఎన్టీవిరామ్‌కుమార్, అల్లంసురేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి జిఎల్ఎన్ శాస్త్రి, తో కలసి అన్నప్రసాదం భవనంలో వంట గదులు, పాత్రలు, నిల్వ ఉన్న కూరగాయల గదిని పరిశీలించారు.

చైర్ పర్సన్ నక్క భానుప్రియపై అవిశ్వాస తీర్మానం

సిద్ధమైన 16 మంది కౌన్సిలర్లు
అనుమతి కోసం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్లు

వెంకటగిరి, మార్చ్ 19, ప్రభాతవార్త మున్సిపల్ చైర్ పర్సన్ నక్క భానుప్రియ పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని 16 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, 15 వార్డు కౌన్సిలర్ దొంతు శారద నేతృత్వంలో కలెక్టర్‌కు అవిశ్వాస తిరుమనంపై వినతిపత్రం అందజేశారు. ఈనెల 20, 21 తేదీల్లో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన ఉన్నందున ముగిసిన తర్వాత ప్రాసెస్ చేపడతానని కౌన్సిలర్లకు కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లు వైసిపి పార్టీకి చెందిన అయితే ఎన్నికల ముందు ముగ్గురు కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో 22 మంది కౌన్సిలర్లు వైసిపి పార్టీ వారే ఉన్నారు. మున్సిపాలిటీలో పరిపాలన కుంటుపడిందని అభివృద్ధి జరగడం లేదని, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ 15 వార్డు కౌన్సిలర్ దొంతు శారద ఆరోపించారు. కౌన్సిల్ సమావేశాలను కూడా సక్రమంగా నిర్వహించలేదని తెలిపారు. నాలుగు సంవత్సరాలు మున్సిపాలిటీ ఎంతగానో వెనుకబడిందని ఆందోళన చెందారు. ఈ సంవత్సరం కాలంలోనైనా మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు చైర్పర్సన్ మార్చాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు ఢిల్లీ బాబు, చంద్రశేఖర్ రెడ్డి, నారి శేఖర్, కుళ్ళు మల్లేశ్వరి, సుభావళి, ప్రభావతి, సుబ్బారావు, కృష్ణమూర్తి, శ్రీనివాసులు రెడ్డిలు కలిసి అవిశ్వాసంపై వినతిపత్రం అందజేశారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో టిక్కెట్ కటింగ్‌ల రోటేషన్

శ్రీకాళహస్తి, మార్చి 19 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారులను కట్టడి చేయటానికి అధికారులు పలు సంస్కరణలు అమలు చేయటానికి ప్రత్నిస్తుంటే దళారులు 'శతకోటి సమస్యలకు అనంత కోటి ఉపాయాలన్న' చందంగా మార్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల దందాను కట్టడి చేయటానికి అధికారులు ప్రత్యేక దర్శనానికి రూ.500ల టిక్కెట్లు కొనుగోలు విధానాన్ని ప్రవేశ పెట్టారు. ఈ నేపథ్యంలో దీనిని కూడా దళారులు ఓవరంగా మలచుకుంటున్నారు. కొందరు ఆస్థాన విద్వాంసుల్లా ఆలయం వద్ద మేనేజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దళారులు అధికారులను కూడా బ్లాక్‌మెయిల్ చేసే స్థితికి చేరుకున్నారంటే వారి ప్రాధాన్యత తెలుస్తుంది. రూ.500 టిక్కెట్లను కొనుగోలు చేసి ఒకసారి దర్శనానికి వెళ్ళిన తరువాత సగం టిక్కెట్లును భక్తులకు ఇస్తారు. దీనిని దళారులు తమ వద్ద ఉంచుకుకుంటున్నారు. దానిని పలు మార్లు రోటేషన్ చేస్తున్నట్లు సమాచారం. అధికారులు ప్రతి టిక్కెట్టుకు ఆధార్ కార్డు లింక్‌చేయాలని యోచిస్తున్నారు. కానీ వారి చర్యలకు ప్రతి చర్య అన్నట్లు దళారులు వ్యవస్థను రూపొందించుకుంటున్నారు. ఇందుకు కొందరు హోంగార్డులు, సెక్యూరిటి సిబ్బంది సహకారం అందిస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. అధికారులు ఎన్ని కట్టుబాట్లు చేస్తున్నా కట్టడి కావటం లేదు. దళారులు భక్తుల్ని శ్రీకాళహస్తిలో కాలు మోపుతూనే కాంటాక్టు చేసుకుంటున్నారు. ఆలయాధికారి ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా అమలుకు నోచుకోవటం లేదు.

భక్తుల సౌకర్యార్థం కళ్యాణ మండపం:

శ్రీకాళహస్తి పట్టణంలో నిరుపేదల కోసం ఓ మహిళా కళ్యాణమండపాన్ని నిర్మించుటకు ఆలయ ఇఓ యోచిస్తున్నారు. టూరిస్టు బస్టాండు ఆవరణలో ఓ మూల కళ్యాణ మండపం నిర్మించుటకు పరిశీలిస్తున్నారు. కళ్యాణ మండపం నిర్మించుటకు దాతల్ని కూడా ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. గతంలో ప్రసన్న వరదరాజస్వామి ఆలయం వద్ద కళ్యాణమండపం ఉండేది. అలాగే ప్రస్తుతం జ్ఞానప్రసూనాంబ అతిథి గృహాల వద్ద టిటిడికళ్యాణ మండపం ఉండేది. దానిని పడగొట్టారు. ఈ అంశాలను పరిశీలించిన ఇఓ నిరుపేదల కోసం ఓ కళ్యాణ మండపం నిర్మించుటకు చర్యలు తీసుకుంటున్నారు. ఓ వైపు దళారుల బెడద మరో వైపు అభివృద్ధి మంత్రంతో పరిపాలన సాగుతుంది.

నేడు ఎన్ఎస్‌యూ నాల్గొవ స్నాతకోత్సవం

వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి విద్య, మార్చి 19 ప్రభాతవార్త జాతీయ సంస్కృత వర్సిటీ నాల్గొవ స్నాతకోత్సవాన్ని గురువారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. వర్సిటీలో బుధవారం స్నాతకోత్సవంపై ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మట్లాడుతూ జాతీయ సంస్కృత వర్సిటీ సంస్కృత భాషను విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. స్నాతకోత్సవంలో ఆచార్య ఎంఏ, ఎమ్మెస్సీ, బీఏ, బీఎస్సీ, యోగా థెరపీలో 546మంది విద్యార్థులకు పట్టాలు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే 75 మందికి పీహెచ్డీ పట్టాలు, పలు విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన సుమారు 42 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్ అందించనున్నట్లు తెలిపారు స్నాతకోత్సవానికి మాజీ ఛాన్సలర్, ఆర్థిక వేత్త, పద్మశ్రీ డాక్టర్ వీఆర్ పంచముఖి హాజరవుతారని, ఎన్ఎస్ యు ఛాన్సలర్ పద్మభూషణ్ గోపాలస్వామి హాజరవుతారని తెలిపారు. బాల్య దశ నుంచి సంస్కృత భాషను నేర్పించేందుకు బాల వికాస కేంద్రాలను ఏర్పాటు చేసి సుమారు 2242 మంది పిల్లలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి వర్సిటీలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యను సైతం ప్రవేశపెట్టనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సాంబశివమూర్తి, ఓ ఎస్ డి రఘునందన్, పీఆర్ ఓ ప్రొఫెసర్ రమేష్, ఏపీఆర్ ఓ లు డాక్టర్ కే కుమార్, బల్టీదాస్, డాక్టర్ నందనరావు పాల్గొన్నారు.

అన్నీ ఒకేచోట

త్వరలో తిరుపతిలో "లులు"మాల్

ప్రభాతవార్త-తిరుపతి: దేశంలోనే ఆధ్యాత్మికనగరం..యాత్రాస్థలం తిరుపతి నగరంలో విస్తరిస్తున్న వ్యాపార వాణిజ్య సముదాలతో బాటు కొత్తగా లులు సంస్థ మాల్ ఏర్పాటుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇందుకోసం ఆ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని తిరుపతి వాసులకు ఆ మాల్‌ను పరిచయం చేయనుంది. సామాన్యజనానికి అవసరమైన అన్ని రకాల వస్తువులు, ఫుడ్‌కోర్టు, అంతర్జాతీయ బ్రాండ్‌ల దుకాణాలు రానున్నాయి. ఈ లులును తిరుపతిలో ఏర్పాటు చేయించే దిశగా సిఎం చంద్రబాబునాయుడు చొరవ తీసుకుంటున్నారు. దీనివల్ల స్థానికంగా ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇప్పటికే తెలుగురాష్ట్రాల్లో తెలంగాణలో హైదరాబాద్ ఏకైక లులు కూకట్‌పల్లిలో నడుస్తోంది. ప్రస్తుతం లులును తిరుపతికి తీసుకువచ్చేందుకు సిఎం ప్రత్యేక చొరవచూపుతున్నారు. ఈ ఏడాది ఆఖరుకు ఈ ప్రాజెక్టు సాకారం అయ్యే సూచనలు ఉన్నాయి.

మద్యం పరవళ్ళు

- పుట్టగొడుగుల్లా మద్యం బెల్టుషాపులు

గుడిపాల, మార్చి 19 ప్రభాతవార్త: గుడిపాల మండలంలో మద్యం ఏరులై పారుతుంది. ప్రభుత్వం జారీ చేసిన మద్యం షాపుల్లోనే మద్యం విక్రయాలు నిర్వహించాలని నిబంధనలు స్పష్టంగా వున్నప్పటికీ మండల పరిధిలోని ఏ గ్రామంకు వెళ్ళి చిన్న షాపులో వెళ్ళి మద్యం కావాలని అడిగితే లభ్యం అవుతుంది. గత ఆగస్టు నెలలో ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీ అమలులోకి తీసుకువచ్చి ప్రైవేటు మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు మండల పరిధిలో నరహరిపేట, బొమ్మసముద్రంల్లో ప్రైవేటు వ్యక్తులు మద్యం షాపులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం షాపుల్లోనే ఉదయం 10 నుండి రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయాలు చేయాల్సి వుంటుంది. మద్యం దుకాణాల లైసెన్సులు జారీ చేసినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు బెల్టు షాపులు, పర్మిట్ రూమ్‌లను అనుమతించలేదు. గత ప్రభుత్వ హయాంలో సైతం మండలంలో ప్రస్తుతం వున్న స్థలాల్లోనే రెండు మద్యం షాపులు వుండేవి. అప్పట్లో ఒకొక్క మద్యం షాపులో రోజుకు 3 నుండి 5 లక్షల రూపాయల వరకు మద్యం విక్రయాలు జరిపేది. ప్రస్తుతం బెల్టుషాపులు, పర్మిట్ రూములు వేటికి అనుమతించనప్పటికీ మండల పరిధిలో పుట్టగొడుగుల్లా బెల్టుషాపుల నిర్వహణ ప్రారంభం అయ్యింది. మండల పరిధిలోని ఏదేని గ్రామంకు వెళ్ళి ఎవరైనా మంచినీరు అడిగినా లేదంటారెమో కానీ మద్యం అడిగితే మాత్రం మద్యం షాపు ధరకంటే రూ.10 నుండి రూ.20 చెల్లిస్తే ఎంత మద్యం అయినా ఇవ్వడానికి బెల్టు షాపులు నిర్వహించే వ్యక్తులు సిద్ధంగా వుంటారు. మద్యం దుకాణదారులు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తుండటంతో మద్యం దుకాణాల్లో ఆశించిన మేరకు మద్యం అమ్మకాలు ప్రస్తుతం జరుగడం లేదు. గతంలో ప్రభుత్వం నిర్వహించిన మద్యం దుకాణాల్లో ఒకొక్క దుకాణంలోని కౌంటర్‌లోనే 3 నుండి 5 లక్షల రూపాయల వరకు మద్యం అమ్మకాలు జరిగితే ప్రస్తుతం దుకాణ కౌంటర్ కేవలం ఒక లక్ష నుండి రూ.1.50 లక్షల వరకు వస్తోంది. మిగిలిన విక్రయాలు బెల్టుషాపులకు మద్యం సరఫరా చేయడం ద్వారా మద్యం దుకాణ వ్యాపారులు పొందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్సైజ్ శాఖ ఏం చేస్తుందనేది ప్రస్తుతం మండలంలో చర్చ జరుగుతున్నది.

అసంపూర్తి గృహాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

శాంతిపురం, మార్చి 19 ప్రభాతవార్త మండలంలోని శివరాంపురం పంచాయతీ గట్టు గ్రామంలో ఎన్టీఆర్ హౌసింగ్ పథకంలో మంజూరైన గృహాల నిర్మాణాలను లబ్దిదారులు ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపిడిఒ పిఆర్‌కు మార్ సూచించారు. గురువారం గ్రామంలో ఆయన పర్యటించి అసంపూర్తి గృహాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, బిసిలకు 50వేలు, ఎస్టీలకు 75వేలు అదనంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. దీంతో ఎస్సీ, బిసిల యూనిట్ విలువ రూ2.30లక్షలు, ఎస్టీలకు రూ 2.55 లక్షలు అవుతుందన్నారు. ఈఅవకాశాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి గిరిబాబు, విఇఎ హరికృష్ణ, విడబ్ల్యుఎ రమేష్ పాల్గొన్నారు. కాగా కదిరిముత్తనపల్లి గ్రామంలో నూతనంగా వేసిన బోరుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలని గ్రామస్తులు ఎంపిడిఒను కోరారు. గ్రామంలో జరిగిన జాతర తగు వసతులు కల్పించినందుకు ఎ ంపిడిఒను వారు సత్కరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన

రామకుప్పం, మార్చి 19 ప్రభాతవార్త స్థానిక శ్రీ సుబ్రమ ణ్యస్వామి ఆలయం వద్ద గురువారం నిర్వహించిన ఉచితకంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పి.డి. వికాస్ మర్మత్, ఈమాస్ ఆస్పత్రి డైరెక్టర్ జాకబ్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఈ వైద్య శిబిరం ఏర్పా టుచేసినట్లు వారు తెలిపారు. అనంతరం వైద్యులు పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి పలువురిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు నరసింహులు, రామూర్తి, సీతాపతి పాల్గొన్నారు.

కడ పి.డి.చే గురుకుల పాఠశాల భవనాలు పరిశీలన

రామకుప్పం, మార్చి 19 ప్రభాతవార్త మండలంలోని గురుకుల పాఠశాల భవనాలను గురువారం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని అలాగే పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.పిఆర్ డిఇ గురవారెడ్డి, మండల టిడిపి అధ్ యక్షుడు ఆనందరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు వాట్సప్ ద్వారా 161 సేవలు - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

రామకుప్పం, మార్చి 19 ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వాట్సప్ ద్వారా 161 సేవలను అందిస్తోందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానికంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ టెక్నాలజీ ద్వారా ప్రజలకు త్వరగా వివిధ సేవలు అందించాలని నిర్ణయించారన్నారు. రెవెన్యూ, విద్యుత్ బిల్లులు, బస్ టికెట్లు, వైద్య సేవలు, ఆలయ దర్శన టికెట్లు, వివాహ ధృవపత్రాలు తదితరాలు మనమిత్ర వాట్సప్ ద్వారా ప్రజలకు అందుతాయన్నారు.వైకాపా నేతలు విష ప్రచారం చేయడం దారుణమన్నారు. తొమ్మిది నెలలకాలంలోనే సిఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చుతున్నారన్నారు. రాష్ట్ర నేతలు మునస్వామి, పట్ర నారాయణ, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు నరసింహులు, ఆంజనేయరెడ్డి, రామూర్తి, సీతాపతి, మనోహర్, రఫీ, రామలింగారెడ్డి, కామరాజునాయక్, రామకృష్ణప్ప పాల్గొన్నారు.

కాణిపాకం గ్రామ పంచాయతీకి 2.12 కోట్లు ఆదాయం

కాణిపాకం, మార్చి 19 ప్రభాతవార్త: కాణిపాకం గ్రామపంచాయతీలో బుధవారం నిర్వహించిన వేలం పాటల ద్వారా 2.12 కోట్లు ఆదాయంగా సమకూరింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంభందించి కాణిపాకం గ్రామపంచాయతీ, కాణిపాకం దేవస్థానంల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాహన పార్కింగ్ రుసుము వసూలు లీజు హక్కుకోసం పంచాయతీ సర్పంచ్ కెఎస్.శాంతి సాగర్‌రెడ్డి, ఇన్‌చార్జి కార్యదర్శి ఎన్.కుసుమకుమారిల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. అయితే బహిరంగ వేలం పాటలలో గుత్తేదారులు ఎవ్వరూ పాల్గొనలేదు. కాని సీల్డ్ టెండర్లు ద్వారా 2.12 కోట్లు రూపాయలకు కాణిపాకంకు చెందిన ఆర్.సెల్వం అనే గుత్తేదారు హెచ్చు పాటదారునిగా టెండరు దక్కించుకున్నారు. ఈసందర్భంగా సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి, కార్యదర్శి కుసుమకుమారిలు మాట్లాడుతూ టెండరు దక్కించుకున్న గుత్తేదారు నిబంధనల మేరకు వాహన పార్కింగ్ రుసుము వసూలు చేయాలని తెలిపారు.

అపోలోలో అ ధునాతన పద్ధతుల్లో కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సలు

తవణంపల్లె, మార్చి 19 ప్రభాతవార్త: అరగొండ అపోలో ఆస ్పత్రిలో అతి తక్కువ సమయం, అతి తక్కువ ఖర్చుతో అధునాతన పద్ధతుల్లో కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు అపోలో జనరల్ మేనేజర్ డాక్టర్ వినోద్, అరగొండ అపోలో ఆస్పత్రి ఆడ్మినిస్ట్రేటర్ చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కొంత కాలంగా అరగొండ అపోలో ఆస్పత్రిలో అధునాతన పద్ధతుల్లో మోకాళ్ళ నొప్పులకు కీళ్ళ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే మొట్టమొదటి సారిగా గ్రామీణ ప్రాంతంలోని అరగొండ అపోలో ఆస్పత్రిలో అపోలో ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి ఆదేశాల మేరకు ఆధునిక పరికరాలతో చెన్నై అపోలోకు చెందిన ప్రముఖ వైద్యబృందంచే శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఇప్పటి వరకు రోబోటిక్ పద్ధతితో కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనితో ఒక్కోఆపరేషన్‌కు ఒకటిన్నర గంటల సమయం పడుతుందేదని తెలిపారు. అయితే ప్రస్తుతం హైక్వాలిటీ పరికరాలతో మ్యానువల్‌గా నిర్వహిస్తున్న శస్త్ర చికిత్సలు కేవలం 30 నిమిషాల్లోనే విజయవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు బుధవారం ఆస్పత్రిలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ విజయ్ కిషోర్‌రెడ్డి, డాక్టర్ కునాల్ పటేల్‌లచే ఆరు మందికి విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు డాక్టర్ వినోద్, చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు. ఈఅవకాశాన్ని అరగొండ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈసమావేశంలో ఆస్పత్రి పీఆర్ఓ కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రిని సన్మానించిన పి.షణ్ముగం

చిత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త: జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, క్రీడలు, యువజన శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని బుధవారం సీనియర్ టిడిపి నాయకులు, దక్షిణాది రాష్ట్రాల జాతీయ బిసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీ పి.షణ్ముగం సన్మానించారు. జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జన్మదినంను పురస్కరించుకుని బుధవారం విజయ వాడలో ఆయనను కలిసిన దక్షిణాది రాష్ట్రాల జాతీయ బిసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీపి.షణ్ముగంజన్మదినశుభాకాంక్షలు తెలిపి ఆయనను సత్కరించారు.

మాలల సింహ గర్జన విజయవంతంకు కృషి

చిత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 23వ తేదీన తిరుపతి మున్సిపల్ మైదానంలో నిర్వహించనున్న రాయలసీమ మాలల సింహ గర్జన కార్యక్రమంలో మాలలందరు కలసికట్టుగా పాల్గొని విజయవంతం చేయాలని మాల జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాల జెఎసి నాయకులు మాలల సింహ గర్జన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలల జెఎసి నాయకులు దుగ్గాని జయరాం మాట్లాడుతూ దళితుల ఐక్యమత్యంను చూసి తట్టుకోలేక మాల, మాదిగలను విడగొట్టడానికి పాలకులు చేసిన ప్రయత్నమే ఎస్సీ వర్గీకరణ అన్నారు. తిరుపతిలో పెద్ద ఎత్తున నిర్వహించనున్న రాయలసీమ మాలల గర్జన కార్యక్రమానికి భారీ సంఖ్యలో ఐక్యమత్యంతో మాలలు హాజరై పాలకులకు కనువిప్పు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో కెవి రాఘవులు, లక్ష్మీనారాయణ, కాణిపాకం ధనలక్ష్మీ, మునస్వామి, దామోదరం, మోక్షేశ్వరరావు, రాబర్ట్, పార్థసారథి, చెంగల్‌రాయుడు, బుల్లెట్‌బాబు, మురళీ, శరవణ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులపై పని ఒత్తిడి భారం

యాదమరి, మార్చి 19 ప్రభాతవార్త: పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి భారం పెరిగిందని తమపై పెట్టిన అదనపు పని భారంను తొలగించాలని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షులు ప్రకాష్, ప్రధాన కార్యదర్శి కల్పనలు ఎంపిడిఒ వేణును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ క్యాదర్శుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్, కల్పనలు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించడం, పారిశుధ్య పనులు చేపట్టడం, పన్నుల వసూళ్ళు తదితర పనులు వుంటాయని వీటితో పాటు ప్రభుత్వం అదనంగా సర్వేలు నిర్వహించాలని తమపై అదనపు భారం వేయడంతో చేయలేకపోతున్నామన్నారు. కార్యదర్శుల సమస్యలను పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని వారు ఎంపిడిఒ వేణును కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ మాట్లాడుతూ సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

అనాద శవానికి అంత్యక్రియలు

పలమనేరు,మార్చి 19,ప్రభాతవార్త: ఓ గుర్తుతెలియని అనాద శవానికి బుధవారం పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు అంత్య క్రియలు చేశారు.సుమారు 70 సంవత్సరాల వృద్ధుడు ఈ నెల 6న అనారోగ్యంతో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరడంతో వైద్యులు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు.అయితే ఈ నెల 12న చికిత్స పొందుతూ ఆ మృద్ధుడు మృతి చెందడంతో మృతదేహాన్ని పోలీసులు,పలమనేరు హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు శివ,జీలాని,పృద్వి,శక్తి ప్రసాద్,కుమార్ రాజులు మృతదేహాన్ని పట్టణంలోని గాంధీనగర్ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

పేదల ఆరోగ్యం పట్ల సిఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ

- ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

- బాధిత కుటుంబానికి 6.50లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ !!

కుప్పం, మార్చి 19 ప్రభాతవార్త పేదల ఆరోగ్యం పట్ల సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. కుప్పం పట్టణంకు చెందిన వేలు అనే చిరువ్యాపారి ఇటీవల అనారోగ్యం బారిన పడి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో వేలు కుటుంబ పరిస్థితిని చిరువ్యాపారుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్ సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సిఎం చంద్రబాబు బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. గురువారం కుప్పం తెదేపా కార్యాలయంలో వేలు భార్యకు ప్రభుత్వం తరపున 6.50లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా పిఎస్ఎం మాట్లాడుతూ ఈనెల 21,22తేదీల్లో కుప్పంలో నిర్వహించే సదరం క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, టిటిడి బోర్డుసభ్యుడు వైద్యం శాంతారాం, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, చిరువ్యాపారుల సంఘ అధ్యక్షుడు మంజునాథ్, మహిళా అధ్యక్షురాలు అనసూయ, జనసేన నరేష్, నేతలు ఉయ్యాల జయరాంరెడ్డి, వల్లెప్ప, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో విభిన్న ప్రతిభావంతులకు సదరం క్యాంప్‌లు

- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మార్చి 19 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఈనెల 21,22 తేదీల్లో కుప్పం ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక సదరం క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన వారికి మార్చి 21వతేది, కుప్పం మున్సిపల్, రూరల్ మండలానికి సంబంధజంచి మార్చి 22న ఈ క్యాంప్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్యాంపులో పాల్గొనే ప్రత్యేక ప్రతిభావంతులు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా వైద్య శిబిరంకు హాజరై పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. సదరం సర్టిఫికెట్ పొందాలనుకున్న వారు తప్పక తమ ఆధార్ కార్డు ఒరిజినల్, గతంలో ఆస్పత్రిలో ఇచ్చిన రిపోర్ట్‌లు,తెల్లరేషన్‌కార్డులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు నాలుగు తమ వెంట తీసుకురావాలని సూచించారు.

తమిళవ్యక్తులు కబ్జాచేసిన ప్రభుత్వ భూమి స్వాధీనం

కుప్పంరూరల్, మార్చి 19 ప్రభాతవార్త మండలం లోని నాయనూరు పంచాయతీలో సర్వే నెం 57లో ఉన్న ఒక ఎకరా భూమిని తమిళనాడుకు చెందిన వ్యక్తులు కబ్జా చేయగా ఆ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ చిట్టిబాబు తెలిపారు. బుధవార ం కబ్జాకు గురైన భూమిని తహశీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి భూమి హద్దులను సర్వే చేయించారు. అలాగే కబ్జాకు గురైన ఎకరం భూమిని స్వాధీన పరచుకుని అక్కడ ప్రభుత్వ భూమి హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, విఆర్వో శ్రీనివాసగౌడ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

పనులు చేయకనే నిధులు స్వాహా!

పూతలపట్టు, మార్చి 19 ప్రభాతవార్త మండలంలో ఎంపీ గ్రాండ్స్ కింద 15 లక్షల రూపాయలు వర్క్ శాంక్షన్ కాగా ఏఈ ఐరాల మండలంలో కొలతలు తీసుకుని పూతలపట్టు మండలంలో ఇరిగేషన్ పనులు చేయించకుండానే నిధులు స్వాహా చేసినట్టు అవినీతి బాగోతం బయటపడింది. ప్రభుత్వ నిధులను స్వాహా చేయడంతో పాటు ఉపాధి కూలీల బ్రతుకులను రోడ్డుపైన పడేస్తున్నారు. దీనిపైన ఆక్రోశించిన ఉపాధి కూలీలు ప్రభుత్వ నిధులను అక్రమంగా అర్జిస్తున్న ఇరిగేషన్ ఏఈ భరత్ పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేయాలని కోరారు.

నిరాడంబరతకు మోహన్‌బాబు నిదర్శనం

చౌడేపల్లి, మార్చి 19 ప్రభాతవార్త నిజాయితీ, నిరాడంబరానికి మంచు మోహన్‌బాబు నిదర్శనమని ఆయన అభిమాన సంఘ నాయకుడు చింతపర్తి తాతయ్య అన్నారు. బుధవారం ప్రముఖ సినీ నటుడు, విద్యాదాత మంచు మోహన్‌బాబు జన్మదినం సందర్భంగా గడ్డంవారిపల్లి రోడ్డులో నివశించే యానాద మహిళలకు చీరలు, పిల్లలకు పండ్లు, తినుబండారాలు పంపిణీ చేసారు. నిరుపేదల పిల్లలకు విద్యా ప్రదాతగా, సమాజ సేవకు నడుం బిగించిన ఆయన నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. అనంతరం విద్యాని కేతన్‌లో ఆయన జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపాడు. ఈ కార ్యక్రమంలో మోహన్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

ధర్మశాస్త్రస రాజశేఖర్ దీక్షితులకు ఘన సన్మానం

చౌడేపల్లి, మార్చి 19 ప్రభాతవార్త ధర్మశాస్త్ర, డాక్టరేట్ బిరుదాంకితుడు స్థానీకం రాజశేఖర్ దీక్షితులను వాసవీ-వనితాక్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించింది. కలకత్తా మహానగరంలో ఈనెల 7న విశ్వజ్యోతి విద్యాపీఠం ది ఓరియంటల్ 46వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ప్రధానార్చకుడు రాజశేఖర్ దీక్షితులకు తెలంగాణా గవర్నర్ విష్ణుదేవవర్మ చేతులకు మీదుగా ధర్మశాస్త్ర డాక్టరేట్ అవార్డునందుకొన్నారు. ఈ మేరకు ఆయన్ను కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీ-వనితాక్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. క్లబ్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ ఇస్సా నాగలక్ష్మి, గౌరవాధ్యక్షుడు ఐఎం రామ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తి(కిటెక్స్)వాసవీ-వనితాక్లబ్ అధ్యక్షులు అన్నం రంగవల్లి, అమరావతి, శ్రీనాథ్, కార్యదర్శి లోకేష్, కోశాధికారులు కలపాటి వాణి, అమరనాథ్, అమరావతి, కుమార్, మహేష్ స్వాములు, క్లబ్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

వేలం పాటద్వారా రూ. 11.36లక్షల ఆదాయం

చౌడేపల్లి, మార్చి 19 ప్రభాతవార్త చౌడేపల్లి మేజర్ పంచాయతీకి వివిధ వనరులకు నిర్వహించిన వేలం పాటద్వారా రూ. 11,36.700లు ఆదాయంగా సమ కూరినట్లు ఇఓఆర్డీ కృష్ణవేణి తెలిపారు. స్థానిక పంచా యతీ కార్యాలయం ఆవరణలో సర్పంచు శ్రీరామ్ భరత్‌వరుణ్ ఆధ్వర్యంలో వేలంపాటలు జరిగాయి. సంవత్సర కాలం పాటు నిర్వహించుకొనే వారపు సంత హక్కును గిరినాయుడు రూ. 9.53లక్షలు, ప్రైవేటు బస్టాండును సి.శ్రీరాములు రూ. 1.81లక్షలు, కొబ్బరి చెట్ట ఫలసాయాన్ని భాస్కర రూ. 2700 లు హెచ్చుగా పాడి దక్కించుకొన్నారన్నారు. కార్యదర్శి మహేశ్వర్, తేదేపా నాయకుడు ఆవుల రామ చంద్రయ్య, స్థానికులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం : యమలా సుదర్శనం

చౌడేపల్లి, మార్చి 19 ప్రభాతవార్త ఎస్సీ వర్గీకరణ భారత రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం అన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో ఈనెల 23న తలపెట్టిన హలోమాల ఛలో తిరుపతి గోడ పత్రికలను ఆవిష్క రించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ తిరుపతిలో లక్షల మంది మాల కుటుంబ సభ్యులతో మాలల సింహ గర్జన సభ జరుగుతుందన్నారు. రాలయసీమ జిల్లాల్లోని మాలలందరూ తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జెఏసీ నాయకులు ప్రభాకర్, ధనశేఖర్, యమలా చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మోహన్, కొత్తపల్లి మణి, శ్రీరాములు, రెడ్డిప్రసాద్, సురేష్, ముకుందా, వెంకట్రమణ, అశోక్, మణి, అంజి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత పెంపొందించడానికి శక్తి యాప్ ఆవిష్కరణ

చిత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త: విద్యార్థినిలు, మహళల భద్రతను పెంపొందించడానికి ప్రత్యేకంగా శక్తియాప్‌ను రూపొందించినట్లు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, ఎస్ఐ నాగసౌజన్యలు పేర్కొన్నారు. చిత్తూరు అపోలో యూనివర్సిటీలోని అపోలో నాలెజ్డ్ లెక్చర్ హాలులో బుధవారం అంతరంగిక ఫిర్యాదుల కమిటీ, అపోలో మహిళా సాధికారిత సెల్ సంయుక్తంగా విద్యార్థినిలకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, ఎస్ఐ నాగసౌజన్యలు మాట్లాడుతూ సమాజంలో మహిళలకు మరింత భద్రత కల్పించడానికి పోలీసు శాఖ ప్రత్యేకంగా శక్తియాప్‌ను సిద్ధం చేసిందన్నారు. ఎక్కడైనా ప్రమాదంలో వున్న మహిళలకు ఈ యాప్ ద్వారా సమాచారం అందిస్తే పోలీసులు క్షణాల్లో సంఘటనా స్థలంకు చేరుకుంటారని వివరించారు. శక్తి యాప్‌లో మహిళలు, విద్యార్థులు ఎలా సమాచారం ఇవ్వాలని అనే విషయాలను వారు విద్యార్థినిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ ఎంబిబిఎస్, బి.టెక్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

ప్రతి కాన్పు విధిగా నమోదు

చిత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త: జిల్లాలోని ప్రైవేటు హాస్పిటళ్ళు, ప్రైవేటు నర్సింగ్ హోమ్స్‌లో జరిగే కాన్పుల సంఖ్యను విధిగా హెచ్ఎంఐఎస్, సిఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని వాటి యాజమాన్యాలనుఆదేశించారు.ప్రైవేటు ఆసుపత్రి, ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో జరిగే ఏ ఒక్క కాన్పు నమోదు మిస్ కాకూడదని,అలాగేప్రతిజననంపై పోర్టల్‌లో నమోదు చేయాల్సిన బాధ్యత ప్రైవేటు ఆసుపత్రుల వారిదేనని స్పష్టంచేశారు.నిబంధనలుఉల్లంఘించిఎవరైనాకాన్పులనమోదుచేయకుంటే వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం మేరకు సంబంధిత క్లినిక్, హాస్పిటళ్ళపై చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్ఓ హెచ్చరించారు.

ఇక్కడ అధికార పార్టీ నేతలదే పెత్తనం

- నిబంధనలకు విరుద్ధంగా వున్నప్పటికీ అధికారులు చేయాల్సిన పరిస్థితి

పాలసముద్రం, మార్చి 19 ప్రభాతవార్త:

జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలోని పాలసముద్రం మండలంలో అధికార పార్టీ నేతలదే పెత్తనం సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వున్నప్పటికీ అధికారులు విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విఎం థామస్ చెప్పినప్పటికీ ఆయన మాట చెల్లుబాటు కాకుండా స్థానికంగా అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకుని మండలంలో తాము చెప్పిందే వేదం అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం బిసీలను ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకెళ్ళడానికి మంజూరు చేసిన బిసీ కార్పొరేషన్ రుణ దరఖాస్తుల్లో సైతం అర్హులైన బిసీ వర్గాలకు చెందిన వారి పేర్లు లేకుండా అగ్రవర్గాలకు చెందిన కొందరి పేర్లను ఇంటర్వ్యూలు ముగిసిన అనంతరం జాబితాను సిద్ధం చేసి బ్యాంకులకు సిఫార్సు చేశారంటే ఇక్కడ అధికారులపై స్థానిక అధికార పార్టీ నాయకుల పెత్తనం ఏ మేరకు వుందో స్పష్టమవుతుంది. బిసీలు కాని వారు బ్యాంకులకు పంపిన జాబితాలోకి ఎలా వస్తారనే విషయంపై మండలంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది. ఈ వ్యవహారంపై జిల్లా అధికారులతో పాటు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్‌లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అర్హులైన బిసీ లబ్దిదారులకు సబ్సిడీ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

టెన్త్ పబ్లిక్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించిన ఇన్‌చార్జి కలెక్టర్

కాణిపాకం, మార్చి 19 ప్రభాతవార్త:

కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్షా కేంద్రా న్ని జిలవ్లా ఇన్‌చార్జి కలెక్టర్ జి.విద్యాధరి బుధవారం పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తం గా ఈనెల 17 నుండి ప్రారంభమై ఏప్రిల్ 1 వరకు జరుగనున్న పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావ రణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 118 కేంద్రాల్లో 21 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. వేసవి కాలం దృష్టిలో ఓఆర్ఎస్ ప్యాకె ట్‌లు, మెడికల్ కిట్లను అందుబాటులో వుండాల

కడుపు నొప్పి తట్టుకోలేక ఆత్మహత్య

చంద్రగిరి, మార్చి 19 ప్రభాతవార్త: నిత్యం కడుపు నొప్పితో భాధపడుతున్న మాదవన్ (23) మంగళవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య గౌరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు .. తొండవాడ సమీపంలోని ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ (జగనన్నకాలనీ) లో మాదవన్, గౌరి దంపతులు నివశిస్తున్నారు. వీరితో పాటు రెండేళ్ళ కుమార్తె, తల్లి లక్ష్మి వుంటున్నారు. మాదవన్ పెయింటర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం రాత్రి భోజనాలు ముగించుకుని మాదవన్ తన బెడ్ రూమ్‌లో పడుకోగా, తల్లి, భార్య, కుమార్తె హాల్లో పడుకున్నారు. అయితే రాత్రి తీవ్రమైన కడుపు నొప్పిరావడంతో భాధను భరించలేక బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో శబ్దాన్ని విని తలుపు తెరచి చూడగా ఉరివేసుకున్న భర్తను చూసి కేకలు వేయడంతో కాలనీ వాళ్ళు వచ్చి మాదవన్‌ను క్రిందకు దించి చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్ మాదవన్‌ను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సిఐ సుబ్బరామిరెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రసూతి ఆస్పత్రిలో రొమ్ము క్యాన్సర్

తిరుపతి హెల్త్, మార్చి 19 ప్రభాతవార్త : ఎస్వీ వైద్య కళాశాల, ప్రసూతి వైద్యశాలలో మెమోగ్రామ్ యంత్రంను (రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరికరం) మహిళా రోగులకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ చేయడానికి ఉపయోగపడే పరికరాన్ని బుధవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వి ఎల్‌వి నరసింహం ప్రారంభించారు. పేద రోగులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ జీవీ రవి ప్రభు, మాజీ రుయా సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, డాక్టర్ ప్రమీల, ప్రసూతి వైద్యశాల సీఎస్ఆర్ఎమ్ఓ ఆర్ఆర్‌రెడ్డి, రుయా ఆస్పత్రి అడ్మిన్ ఆఫీసర్ కనకనరసారెడ్డి, డాక్టర్ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి, రుయా ఆస్పత్రి సిబ్బంది, ప్రసూతి ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, ఫార్మసీ ఆఫీసర్ శశి, ఎస్‌వి వైద్య కళాశాల పీఆర్వో వీర కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ కోసం అవగాహన ఒప్పందం

తిరుపతి విద్య మార్చి 19 ప్రభాత వార్త టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్వయం ప్రతిపత్తిగల ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థుల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కోసం జగతి నెట్వర్క్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మధ్య బుధవారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా పిన్సిపల్ డాక్టర్ బి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో అవగాహన ఒప్పందం కుర్చుకున్నామని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాములు అందించబడతాయని చెప్పారు. తద్వారా విద్యార్థులలో నైపుణ్యత పెరిగి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని తెలిపారు. జగతి నెట్వర్క్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జె వాసుదేవ నాయుడు, బి సులోచన రాణి, పి చంద్రయ్య, సృజన, పాల్గొని ఒప్పందప పత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానికులనే రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌గా నియమించాలి.

తిరుపతి విద్య మార్చి 19 ప్రభాత వార్త ఎస్వీ యూనివర్సిటీలో అఖిలపక్ష విద్యార్థి సంఘ నాయకులు సమావేశం నిర్వహించి ఎస్వీ యూనివర్సిటీలో ఇంతవరకు పూర్తిస్థాయి రెగ్యులర్ విసిని నియమించక పోవడం వలన ఎస్వీ యూనివర్సిటీలో అభివృద్ధి వెనుకబడిందని తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టువంటి విశ్వవిద్యాలయాల్లో పూర్తిస్థాయి వైస్ ఛాన్స్ లను రెగ్యులర్‌గా, నియమించి వారికి పరిపాలన బాధ్యతలు అప్పగించడం జరిగింది అని ఎస్ వి యూనివర్సిటీకు మాత్రం ఇంకా ఇన్చార్జి విసీ లు కొనసాగుతున్నారని, కనుక వెంటనే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి ఎస్వీ యూనివర్సిటీకి, వెంటనే రెగ్యులర్ విసిని నియమించే బాధ్యతను తీసుకొని ఎస్ వి యూనివర్సిటీ అభివృద్ధికి దోహదం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష విద్యార్థి సంఘం నాయకులకు కోరారు. ఎస్వీ వర్సిటీలో ఎంతో మేదా సంపద కలిగిన ప్రొఫెసర్స్ ఉన్నపటికీ కూడ బయట ఉన్న ఢిల్లీ, కన్పూర్, ముంబై, ఐఐటి లో ఉన్న అవగాహన లేని వారిని ఉప కుల పతులుగా నియమించడం వల్ల యూనివర్సిటీ అభివృద్దినీ ఏ విదంగా చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏపి స్టూడెంట్స్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్, మురళి కృష్ణ, ప్రేమ్ కుమార్, సుధాకర్ మాదిగ, యుగంధర్, జేడీ ప్రసాద్, లోకేష్, విక్రమ్, ముని, మల్చి ఉపేంద్ర, సుకుమార్, రాజశేఖర్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

గేట్‌లో ఎస్వీయూ విద్యార్థినికి 78వ ర్యాంకు

తిరుపతి విద్య, మార్చి 19 ప్రభాత వార్త ఎస్వీయూ ఫిజిక్స్ విభాగానికి చెందిన పీజీ విద్యార్థిని బి కీర్తి బుధవారం విడుదలైన గేట్ ఫలితాలలో జాతీయ స్థాయిలో 78 వ ర్యాంక్ సాధించింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆమె వర్సిటీలో ఎమ్మెస్సి ఫిజిక్స్ లో పొటానిక్స్ ప్రత్యేక అంశంగా అధ్యయనం చేశారు. ప్రొఫెసర్ బి దేవ ప్రసాద్ రాజు ప్రోత్సాహంతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. గేట్ పరీక్షల్లో ర్యాంకు పొందడం ద్వారా జాతీయ స్థాయి యూనివర్సిటీలో పిహెచ్ డి లో అవకాశం దక్కింది. అధ్యాపకులు, అధికారులు అభినందించారు.

3ముత్యాలమ్మకు ప్రత్యేక అభిషేకాలు

.శ్రీకాళహస్తి. మార్చి 19 ప్రభాతవార్త పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వరాయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో వెలసిన అమ్మవారికి బుధవారం మూలవిరాట్టుకు విశేష అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేపట్టారు. ఈనేపథ్యంలో ముత్యాలమ్మ అమ్మవారికి విశేషాలంకరణ చేపట్టి అలంకరణ నిర్వహించారు. ఆలయ పూజారి పరమేశ్వరయ్య ఆధ్వర్యంలో ముత్యాలమ్మ మూలవిరాట్టుకు సుగంధద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేషాలంకరణ చేపట్టారు. ఈసందర్భంగా అమ్మవారికి పలువురు మహిళా భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు అందించారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకంచేసిన మీ సేవ ఆపరేటర్లు

.శ్రీకాళహస్తి, మార్చి 19 ప్రభాతవార్త రాష్ట్ర మీసేవ అసోసియేషన్ పిలుపు మేరకు నియోజకవర్గంలోని మీసేవ ఆపరేటర్లు పట్టణంలోని ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, రాష్ట్ర ఐటిశాఖ మంత్రి నారాలోకేష్, నియోజకవర్గ ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా మీ సేవ ఆపరేటర్లు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో అసెంబ్లీ సాక్షిగా మీసేవ ఆపరేట్లను మరల ఐటిశాఖలోకి చేరుస్తామని ఐటిశాఖ మంత్రి నారాలోకేష్ తెలపడం రాష్ట్రంలో ఉన్న మీసేవ ఆపరేటర్ల కుటుంబమంతా ఆనందదాయకంలో మునిగింది. కార్యక్రమంలో శ్రీకాళహస్తి అర్బన్ అండ్ రూరల్ ఆపరేటర్లు సూర్య, కిరణ్, శ్రావణ్, షామీర్, గురవయ్య, శ్యాం, కవిత, మరియు తొట్టంబేడు ఆపరేటర్లు కిరణ్, నూతన మరియు ఏర్పేడు మధు, యుగంధర్, రేణిగుంట మీ సేవ ఆపరేటర్లుపాల్గొన్నారు.

22వ తేదీవరకు స్పెషల్ ఆధార్‌క్యాంపులు

.తొట్టంబేడు, మార్చి 19 ప్రభాతవార్త మండలంలోని నాలుగు గ్రామ సచివాలయాల్లో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు స్పెషల్ ఆధార్ నమోదు కేంద్రాలును ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఓ సురేంద్రనాథ్, తహశీల్దార్ మధుసూధనరావు తెలిపారు. గ్రామ సచివాలయాల్లో స్పెషల్ ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించడం, ఇందులో డిజిటల్ సహాయకులుగా నియమించడమైందన్నారు. పంచాయతీ కార్యదర్శులుఅందరు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు గ్రామసచివాలయ సిబ్బందితో సమాచారం అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. చియ్యవరం పరిధిలోని చియ్యవరం, ఇలగనూరు, పెద్దకన్నలి పరిధిలోని పెద్దకన్నలి, బసవయ్యపాళెం, పెద్దకన్నలి గ్రామాల్లో సచివాలయాల్లో ఈనెల 22వ తేదీ వరకు ఆధార్‌క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నీలకంఠేశ్వస్వామి సమీపంలో బోర్డులు ఏర్పాటు

శ్రీకాళహస్తి, మార్చి 19 ప్రభాతవార్త

పట్టణానికి సమీపంలోని నీలకంఠేశ్వరస్వామి దేవ్ధానానికి ముందు భాగంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో అర్బన్ సిఐ డి.గోపి తమ సిబ్బందితో కలసి వెళ్ళారు. ఇందులో భాగంగా ఇక్కడ ఎవ్వరు మద్యం సేవించడం, మాంసాహారం తినడం వంటి చర్యలు చేపట్ట రాదని సిఐ తెలిపారు. ఖాళీ ప్రదేశం కావడంతో ఎక్కువమంది రాత్రి వేళల్లో ఇక్కడ మద్యం బాబులు ఎక్కువవుతున్నారని తమ దృష్టికి వచ్చిందని దీంతో ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను సరిచేశారు. రాత్రివేళల్లో పోలీసుల నిఘా ఉంటుందని, అంతేకాకుండా ప్రత్యేకంగా వచ్చిన టెక్నాలజీతో డ్రోన్‌లతో సర్వే నిర్వహించి మద్యం సేవిస్తున్న వారిని గుర్తిస్తున్నామన్నారు.

తిరుపతిలో ఘనంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు

తిరుపతి హెల్త్, మార్చి 19 ప్రభాతవార్త : రాష్ట్ర రవాణా, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త గుణకల మురళీ, బాలకృష్ణారెడ్డి (యూకే)ల ఆధ్వర్యంలో శ్రీ గోవిందరాజుల స్వామి ఆలయం, తిరుచానూరు రోడ్డులో కేక్ కట్ చేసి మంత్రి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి, పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుణకల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

-రీ సర్వేని ఆకస్మిక తనిఖీ చేసిన... ...ల్యాండ్ రికార్డ్స్ అడిషనల్ డైరెక్టర్ గొవిందరావు

తిరుపతిరూరల్, మార్చి19 ప్రభాతవార్త: రీ సర్వేలో ఎలాంటి భూ సమస్యలు ఉత్పన్నం కాకుండా సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అడిషనల్ డైరెక్టర్ ఆర్.గొవిందరావు ఆదేశించారు, తిరుపతిరూరల్ సి.గొల్లపల్లిలో జరుగుతున్న రీ సర్వేని బుధవారం అడిషనల్ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసారు. రీ సర్వే తలెత్తే సమస్యలను సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వేయర్లు రైతుల సమస్యలను సావధానంగా వింటూ, రీ సర్వే చేసి, రైతులకు న్యాయం చేయాలని సూచించారు. రీ సర్వేలో హద్దులను గుర్తించి, హద్దురాళ్ళను పక్కాగా ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే గొల్లపల్లిలో సర్వేయర్లు రీ సర్వే బాగా చేస్తున్నారని సిబ్బందిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ అరుణ్‌కుమార్, రీసర్వే డి.టి. మోహన్‌బాబు, మండల సర్వేయర్ హేమకుమార్, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

రాస్ సారధ్యంలో ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం

శ్రీకాళహస్తి, మార్చి 19 ప్రభాతవార్త శ్రీకాళహస్తిలోని ఎన్‌టిఆర్ నగర్‌లో వెలసిన రాస్, టాటాట్రస్టు క్యాన్సర్ ఆసుపత్రి సారధ్యంలో బుధవారం ఉచిత క్యాన్సర్ శిబిరాన్ని నిర్వహించారు. రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ వెంకటరత్నం ఆదేశాలతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్లు దేవతి, సుచిత్ర హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మనిషి జీవితం పని ఒత్తిడి భారంతో యాంత్రికంగా మారటం వలన తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దాంతో వ్యాధులు ముదిరి హాస్పిటల్స్‌యే శరణ్యంగా మారిందన్నారు. తమ బ్యాంకు ద్వారా మహిళలకు మాత్రమే జీవన సమృద్ధి ఖాతా ఓపెన్ చేసుకొని 15వేల రూపాయలు నిల్వ తమ ఖాతాలోనే ఉంచుకోగల్గితే కార్యన్సర్‌కు రూజు10లక్షలు మరియు ప్రమాదాలకు రూ.5లక్షలు బీమా ఉందని వివరించారు. ట్రస్టు ప్రోగ్రాం మేనేజర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ మొదట తన ఆరోగ్యం బాగుంటే తమ కుటుంబం అనందంగా ఉంటుందని గుర్తించాలన్నారు. జనం నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ కార్యక్రమాల్లో టాటా ట్రస్టు డాక్టర్ వెంకయ్యబాబు, రెడ్డికుమారి, వినీత, మహేంద్ర, ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, వినోద్, ముఖేష్, రాజేశ్వరిశబ్నంగౌతమి, జయలలిత, నాగలక్ష్మీ జయంతి, అనిత పొదుపు సంఘాల సభ్యుల పాల్గొన్నారు.

మోహన్‌బాబుకు శివయ్య ప్రసాదాలు

శ్రీకాళహస్తి, మార్చి 19 ప్రభాతవార్త సినీ నటులు, మాజీ రాజ్యసభ సభ్యులు, విద్యానికేతన్ నిర్వాహకులు డాక్టర్ మంచు మోహన్‌బాబు జన్మదిన సందర్భంగా బుధవారం శివయ్య ప్రసాదాలను అందించారు. మా జీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మె న్ కోలా ఆనంద్‌కుమార్‌వారి సహాచరులు బుధవారం విద్యానికేతన్ కళాశాల ఆవరణలో జరిగిన మోహ న్‌బాబు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఆయనకు శుభాకాంక్షలుతెలిపి కలంకారి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను చిత్రపటాన్ని అందించారు.

ముచ్చివోలులో స్టెమ్ ల్యాబ్ ప్రారంభం

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 19 ప్రభాతవార్త శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలులో బుధవారం క్రైసంస్థ సహకారంతో ప్రగతి సంస్థ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్టెమ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ మాట్లాడుతూ పిల్లలో సైన్స్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ లెక్కల పట్ల ఆశక్తిని పెంచుటకే లక్ష్యంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. శ్రీకాళహస్తి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌సి, ఎస్‌టి జనాభా అత్యధికంగా ఉందన్నారు. ఈ విద్యార్థులు విద్యలో వెనుకబడి ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరిలో విద్యపట్ల ఆశక్తి పెంచుటకు ఒక్కొక్కస్కూల్‌కు రూ.7లక్షల విలువ చేసేస్టేమ్‌సెంటర్లను ఏర్పాట్లు చేసినట్లు రమణ వివరించారు. ఇందులో మోడల్స్ 100 బ్యాక్ డ్రాప్ 100 సైడ్ శ్లాబ్స్ 16 ఫేక్లిసెస్ 4 ఎలక్ట్రికల్ పాయింట్స్ 4 స్టిక్కర్లు ఒక సెట్లు సైంటిస్టు ఫేక్సీలు 10 నేమ్ ప్లేట్ 1 పిడీ పెన్, సెన్సర్ స్కెట్ క్లట్ 10 అందించామన్నారు. వీటిని ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్తుల్లో శక్తి సామర్థ్యాలు పెరిగి బాల కార్మికులు, బాల్యవివాహాలు తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఇఓ భువనేశ్వరి, ప్రగతి సంస్థ కో ఆర్డినేటర్ కె.నారాయణ, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ మంజూసా శ్రీకాళహస్తి మండల కోఆర్డినేటర్ ప్రభాకర్, విజయలక్ష్మీ, శిరీష, సర్పంచ్ నరసింహారెడ్డి, బోస్, రామచంద్ర, సురేష్, రాజేశ్వరి, రామచంద్ర, సుమలత తదితరులు పాల్గొన్నారు.

గురుబ్రహ్మ అవార్డుకు కూనాటి ఎంపిక



శ్రీకాళహస్తి రూరల్, మార్చి 19 ప్రభాతవార్త విశాఖ పట్టణానికి చెందిన సెయింట్ మదర్ థెరిస్సా సోషల్ ఆర్గనైజేషన్ ప్రతి ఏటా ప్రకటించే గురుబ్రహ్మ అవార్డుకు ఈ ఏడాది శ్రీకాళహస్తికి చెందిన ఓ ఉపాధ్యాయుని ఎంపిక చేసినట్లు బుధవారం సమాచారం అందింది. విద్యారంగంలో వికసించిన కుసుమానికి పలువురు అభినందించారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘీక శాస్త్రాన్ని బోధించే ఉపాధ్యాయుడు 'కూనాటి సురేష్' ప్రకటించారు. ప్రతి ఏడాది కొన్ని సంస్థలు ఉపాధ్యాయులకు ప్రతిష్టాత్మక అవార్డులను అందిస్తున్నారు. ప్రస్తుతం సురేష్‌కు ప్రకటించిన గురు బ్రహ్మ అవార్డును విశాఖ పట్టణంలో జరిగే కార్యక్రమాలలో అవార్డునుఅ ందుకోవాల్సి ఉంది. ఇప్పటికే సురేష్‌కు గురుదేవా, గురుమిత్ర, అంధ్ర రత్నం, రెండు జాతీయ అవార్డులను అందుకున్నారు. అయితే సురేష్ విశాఖకు వెళ్ళలేని కారణంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలోన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజకుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

కంచిస్వామి విజయ యాత్ర: వారం పాటు శ్రీకాళహస్తిలో పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 19 ప్రభాతవార్త కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి విజయయాత్రలో భాగంగా గురువారం శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి వస్తున్నారు. ఈ మేరకు స్వామి స్వాగతానికి విస్తృత ఏర్పాట్లు చేయటానికి తన సిబ్బందికి ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన విడుదల చేసినుత్తర్వులలో స్వాగతానికి సంబంధించి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్వామిజి 4గంటలకు వస్తున్నారు. ఆయనకు పొన్నాలమ్మ గుడి నుంచి జలవినాయకుని వరకు భారీ ఎత్తున స్వాగతం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయం నుంచి గంగాసదన్‌కు వెళ్లు వరకు ఏర్పాట్లును ఆదేశించారు. ఈ కార్యక్రమాలను అన్ని విభాగాలత సమన్వయం చేసుకొనుటకు డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఇంజనీరింగ్ విభాగం రెడ్‌కార్పెట్, బ్యానర్లుతో పాటు ఇతర ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వామిజీ పర్యటనలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఇఇ మురళీధర్‌రెడ్డి, ఎఇఓ పి.లోకేష్‌బాబు, సి.నాగభూషణం, డి.లావణ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ బి.వెంకటకృష్ణారెడ్డి ప్రోటోకాల్ ఎఇఓ కె.విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం నాయుడులుపర్యవేక్షించుటకు ఇఓ బాపిరెడ్డి ఆదేశించారు.

వారం పాటు పూజలు: కంచికామకోటి పీఠాధిపతి విజయ యాత్రలో భాగంగా వారంరోజుల పాటు దక్షిణ కైలాసంలోని భరద్వాజతీర్థంలో పూజలు జరుపుటకు నిర్ణయించారు. ఈ మేరకు శ్రీకాళహస్తీ శ్వరాలయం ఏర్పాట్లు చేపట్టింది. గతంలో కూడా కంచిపీఠాధిపతులు, జగద్గురు ఆదిశంకరాచార్యుల వారు చాతుర్మాస వ్రతాన్ని శ్రీకాళహస్తిలోని బ్రహ్మగుడి వద్ద నిర్వహించారు. నేడు పీఠాధిపతి వారం రోజుల పాటు ఇక్కడ పూజలు నిర్వహించుటకు భక్తుల్ని చైతన్యవంతుల్ని చేయుటకు నిర్ణయించారు. ఈమేరకు స్వామి ఇక్కడ బస చేసినంత కాలం ఎలాంటి లోటు లేకుండా పర్యవేక్షణకు సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు.

తిరుపతి డివిజన్

గంగమ్మ హుండీ ఆదాయం

రూ.22.75లక్షలు

తిరుపతి(రవాణ), మార్చి 19ప్రభాతవార్త: తాతయ్యగుంట గంగమ్మఆలయం హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. అమ్మవారి హుండీ లెక్కింపులో 22,75,86రూపాయలు ఆదాయం చేకూరిందని ఆలయ ఈఓ ఎ.జయకుమార్ తెలిపారు. 24గ్రాముల బంగారు, 720 గ్రాముల వెండి కూడా ఉంది. 78రోజులకు అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించినట్లు ఈఓ తెలిపారు. డిఈఓ కార్యాలయం నుండి పర్యవేక్షణఅధికారిగా వినోద్‌కుమార్, సప్తగిరిగ్రామీణబ్యాంకు ,ఈస్టు పోలీసులు, సేవాకుటుంబస్వచ్ఛత సంస్థ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

పాకాల, మర్చి 19, ప్రభాతవార్త పాకాల మండలం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు డా. రమేష్ కుమార్ అధ్యక్షత వహించి మాదక ద్రవ్యాలు అత్యంత ప్రమాదకరమని, వాటి వలన జీవితాలు నాశనం అవుతాయని కనుక యువత వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈగల్ కో ఆర్డినేటర్లు డా. మాసులామణి, డా. ఈశ్వరబాబు అధ్యాపకులు డా. మాధవి, డా. రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

రివర్ ఎలక్ట్రిక్ స్కూటర్స్ షోరూమ్ ప్రారంభం

తిరుపతి(రవాణ), మార్చి 19ప్రభాతవార్త: తిరుపతి నగరంలో బెంగుళూరుకు చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీ సంస్థ రివర్ నూతన షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. బుధవారం ఉదయం ఈ షోరూమ్‌ను టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ప్రారంభించారు. స్థానిక రేణిగుంటరోడ్డులోని పాతహీ రోహోం డా షోరూమ్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రివర్ స్టోర్ వినియోగదారులకు ఇండీ, యాక్స సరీలు, మర్చండైజ్‌తో సహా అన్ని రివర్ ఉత్పత్తుల శ్రేణిని ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉంటుందన్నారు. తిరుపతిలోని ఈ స్టోర్ కొద్దిరోజుల్లో రివర్ తమ కార్యకలాపాలను అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. ఇండీ ధర 1,42,999రూపాయలని, వినియోగదారులు టెస్ట్‌కోసం షోరూమ్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఇండీని బుక్‌చేసుకోవచ్చన్నారు.

మహిళలకు డిజిటల్ భద్రతపై కార్యశాల

తిరుపతి విద్య మార్చి 19 ప్రభాత వార్త ఎస్వీయూ మహిళ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఖిమహిళకూ సాంకేతికత, డిజిటల్ భద్రతలో రక్షణ, నివారణ చర్యలుఖిఅనే అంశంపై ఒక్కరోజు కార్యశాల నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ ఆర్ట్స్ కళాశాల అధ్యక్షురాలు ఆచార్య సుధారాణి మాట్లాడుతూ సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా మహిళలు వ్యక్తిగత అంశాలలో సాంకేతిక సామాగ్రి, వస్తువులు, యాప్లు ఉపయోగించేటప్పుడు వాటి యొక్క అనుమతుల విషయంలో జాగ్రత్తగా గమనించి అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. ప్రధానంగా కెమెరాలు కలిగిన సాంకేతిక వస్తువుల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని, అదేవిధంగా బయట ప్రదేశాలలో సంచరించేటప్పుడు, సేదతీరేటప్పుడు అప్రమత్తతో ఉండాలని హితువుపలికారు. విభాగాధిపతి ఆచార్య సాయి సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, మహిళ పరిశోధకులు, మహిళ అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

*తి

సైబర్ నేరాలపై ప్రజల అప్రమత్తంగా ఉండాలి : సిఐ

వెంకటగిరి, మార్చి 19 ప్రభాతవార్త : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఏవి రమణ తెలిపారు. వెంకటగిరి సర్కిల్ కార్యాలయంలో సిఐ విలేకరుల సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు యాప్స్ వంటివి సెల్ఫోన్లకు పంపి వాటి నొక్కితే అకౌంట్‌లో ఉన్న వారికి వెళ్తుందని తెలిపారు. ఓటిపి వంటివి చెప్పరాదని తెలిపారు. సైబర్ నేరకాల చేతిలో మోసపోవద్దని సూచించారు. మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శక్తి యాప్ సెల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రమాదాల్లో ఉన్నప్పుడు శక్తి యాప్ ఉపయోగపడుతుందని చెప్పారు. వేసవికాలంలో చోరీలు ఎక్కువ జరుగుతాయని అందరు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అందరూ ఆరు బయట వేసవికాలంలో పడుకుంటారని ఇళ్లకు తాళాలు పగలగొట్టి సోరీ చేస్తారని తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే సమయంలో పోలీస్ స్టేషన్లో సమాచారం ఇస్తే మంచిదని తెలిపారు. పశువుల యజమానులు వాటిని వీధుల్లో వదలరాదని తెలిపారు. ఆవులు వీధిలో తిరుగుతున్నందున ట్రాఫిక్కుకు అంతరాయం కలుగుతున్నట్లు చెప్పారు. యజమాలలో వారి ఆవులను ఇంటి వద్ద భద్రపరచుకోవాలని కోరారు. ఇంకా పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

పేదరిక నిర్మూలన లక్ష్యం : ఆరి శంకరయ్య

వెంకటగిరి, మార్చి 19 ప్రభాతవార్త : పేదరిక నిర్మూలన లక్ష్యమని 14 వ వార్డు కౌన్సిలర్, వైఎస్ ఆర్సిపి ఆర్టిఐ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు ఆరి శంకరయ్య తెలిపారు. 14వవార్డు సుదర్శన నగర్ లోని సచివాలయంలో పొదుపు గ్రూపుల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూపు సభ్యులు ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నిడిగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘచే పంచాంగ పుస్తకావిష్కరణ

గూడూరు, మార్చి 19 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమైక్య గూడూరు శాఖావారి ఆధ్వర్యంలో బుధవారం బ్రాహ్మణ భవనంలో పంచాంగ పుస్తక ఆవిష్కరణ, నెల్లూరు వాస్తవ్యులు పండితులు, గొప్ప బ్రాహ్మణ బందు ప్రీతి కలవాడు ఆలూరు శిరోమణి శర్మ వారి ధర్మపత్ని చేతుల మీదుగా భవనములో పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. శిరోమణి శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులు అందరూ కూడా ఈ ఉగాది రోజు శ్రీ విశ్వావసునామ సంవత్సర పంచాంగం మీ ఇంటిలో చదవాలి అని కోరారు. అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ వారు గొప్ప సేవ దృక్పథం గలవారు పెంచలకోనలో ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు అనిమెళ్ల శివకుమార్, సెక్రెటరీ చిట్టమూరు శ్రీనివాస రావు, కోశాధికారి విద్యా లలిత, దూబగుంట శ్రీనివాస్, వేపకొమ్మ నరసింహారావు, కడివేటి రామ్మూర్తి, కనుమెళ్ల వెంకట సుబ్బారావు, ఏలూరు ప్రకాశం పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

చలో విజయవాడ జయప్రదం చేయండి

- రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.నారాయణ

గూడూరు, మార్చి 19 ప్రభాతవార్త : ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27వ తేదీన చలో విజయవాడ మహా ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం గూడూరు లోని ఏపీఎస్ఆర్టీసీ కార్యాలయం ముందు ఎం. శేషయ్య రిటైర్డ్ ఎంప్లాయిస్ గూడూరు డివిజన్ యూనియన్ నాయకులు ఆధ్వర్యంలో నిరసన తెలియజేసారు. నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమస్యలను వివరిస్తూ అనేకసార్లు వినతి పత్రాలు సమస్యలను వివరించడం జరిగిందని, రీజనల్ మేనేజర్ కార్యాలయం వద్ద ధర్నాలు చేయడం జరిగిందని, కొన్ని సమస్యలు పరిష్కారం అయినా అనేక పని సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్నాయని నెలలు సంవత్సరాలు గడుస్తున్నా సమస్యలకు పరిష్కారం లేకపోవడంతో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. పెన్షన్ దారుడు మరణిస్తే నామినీగా ఉన్న అతని భార్యకు జీవితాంతం పెన్షన్ చెల్లించాలని, కానీ పుట్టిన తేదీల్లో మార్పు జరిగిందని, పేరుతో కొన్ని అక్షరాలు తేడా ఉన్నాయని అనేక కారణాలు చెప్పి ఆమెకు చెల్లించాల్సిన సొమ్ము చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని, అందువలన నిబంధనలను సులభతరం చేసి ఆర్టీసీ రికార్డులను ఆధారం చేసుకుని పెన్షన్ చెల్లించే ఏర్పాటు చేయవలసిందిగా వారు కోరడం జరిగింది. ఈనెల 27వ తేది గురువారం విజయవాడ విసి అండ్ యండి కార్యాలయం వద్ద జరుగుచున్న మహాప్రదర్శనలో ఆర్టీసీలో రిటైర్డ్ అయిన సోదర, సోదరీమణులు, మరియు సర్వీసులో ఉన్న ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాప్రదర్శన జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బి.వి.రమణయ్య రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డివిజన్ ఉపాధ్యక్షులు, ఎం. శేషయ్య, రిటైర్డ్ ఎంప్లాయిస్ గూడూరు డివిజన్ యూనియన్ నాయకులు వై.హరినాథ్, ట్రెజరర్ ఎస్.రత్నయ్య, ఏ. రాజారాం, ఈ.జయచంద్ర, సి.హెచ్.గోపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు విజయలక్ష్మి, తిరుపతమ్మ, బి.రామమ్మ, తదితరులు పాల్గొన్నారు.

22న డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

గూడూరు, మార్చి 19 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్, సిడాఫ్, డిఆర్‌డిఎ సంయుక్త ఆధ్వర్యంలో గూడూరులోని డిఆర్‌డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22వ తేది శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్. లోకనాథం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలైన గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్, ఆల్ట్రా మెరిన్ పిగ్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో టైర్స్ తదితర కంపెనీలలో ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ లేదా ఐటిఐ లేదా డిప్లమా లేదా ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత అయిన యువతీ యువకులు అర్హులన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే యువతీ యువకులు ఇచ్చిన రిజిస్ట్రేషన్ లింకులో ఆధార్ ఓటిపితో రిజిస్ట్రేషన్ చేసుకుని, ప్రొఫైల్ లాగిన్ అయ్యి అన్ని కంపెనీలకు అప్లై చేసుకుని అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

గూడూరు డివిజన్

వేసవిలో చోరీలు జరగకుండా ప్రత్యేక నిఘా : ఎస్ఐ

వెంకటగిరిరూరల్, మార్చి 19 ప్రభాతవార్త: పట్టణ,గ్రామీణ పరిధిల్లో చోరీలు జరగకుండా తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలు మేరకు గూడూరు డిఎస్పీ గీత కుమారి వేసవిలో చోరీలు అరికట్టేందు కోసం రాత్రి వేళలల్లో సిబ్బ ందిచే గట్టి నిఘా తోపాటు గస్తీ ముమ్మరం చేసినట్లు ఎస్.ఐ జి.సుబ్బారావు తెలిపారు. సమావేశంలో అయన మాట్లడుతూ పట్టణంలో ట్రాఫిక్ పరిష్కారానికి ప్రతేక్య చర్యలు తీసుకోంటున్నట్లు తెలిపారు.అదే విధంగా చోరీలుపై కూడా గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి వేళలల్లో పట్టణంలో తిరిగే ఆటోలు పోలీస్ స్టేషన్‌లో అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. అలాగే రాత్రి 11గంటల సమయంలో రోడ్లపై అనుమానస్పదంగా సంచరించే వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి పంపాలని తెలిపారు.పట్టణ వాసులు తమ బందువులు పెళ్ళిలకు,ఇరత కార్యక్రమాలకు వెళ్ళేవారు పక్కన ఇళ్ళువారికి పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 08625-257033,లేదా 944079 6349 నంబర్లకు సమాచారం అందించాలని స్థానిక పట్టణ ప్రజలు పోలీసులకు సహకరించాలని తెలిపారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

వాకాడు, మార్చి 19 ప్రభాతవార్త: వాకాడు మండలం తిరుమూరు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేసి కార్యాల యంలో ఉన్నటువంటి పలు రికార్డులు సర్వేకి సంబంధించినటు వంటి అప్డేట్స్‌ని సచివాలయ సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని సచివాలయ సిబ్బంది తదుపరి విధుల్లోకి వెళ్ళవలసిందిగా సూచించారు. ప్రభుత్వం సూచించిన అన్ని సర్వేల్లో తిరుమూరు గ్రామ సచివాల యాన్ని ప్రథమంలో నిలవాలని పంచాయతీ కార్యదర్శి సురేష్‌ని ఆదేశించారు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను సకాలంలో పూర్తి చేయవలసినదిగా ఆదేశించారు. రాబోయే ఎండాకాలంని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి లేకుండా సచివాలయం సిబ్బంది ముందస్తుగా చూసుకోవాలని చెప్పారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నాయో అని సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమం లో వీఆర్వో హరి బాబు, అగ్రికల్చర్ అసిస్టెంట్ మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిషోర్, డిజిటల్ అసిస్టెంట్ షమీయుల్లా వున్నారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

గూడూరు, మార్చి 19 ప్రభాతవార్త: గూడూరు డివిజన్ పరిధిలోని ఓడూరు గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం ఉందని రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల విచారణలో మృతి చెందిన వ్యక్తి మస్తాన్ ఇసుక పాలెం గ్రామ వాస్తవ్యుడు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరిగడంతో బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని మస్తాన్ మృతి చెందాడు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానిస్తున్నారు.

ముగిసిన శ్రీ అళఘునాథ స్వామి బ్రహ్మోత్సవాలు

గూడూరు, మార్చి 19 ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీ అళఘునాథ స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు స్వామి అమ్మవార్లకు విశేషాలంకరణ ఏర్పాటు చేసి సామూహిక లక్ష తులసి పూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా పాబోలు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టిస్తే కఠిన చర్యలు :తహశీల్దార్

గూడూరు, మార్చి 19 ప్రభాతవార్త : తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టిస్తే కఠిన చర్యలు చేపడతామని గూడూరు తహసిల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణానికి చెందిన మొగిరాల నాగేశ్వర రావు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం కోసం అప్లై చేసుకున్నాడని, కుటుంబ సభ్యుల వివరాలు దాచిపెట్టి సర్టిఫికెట్‌ను పొందడం జరిగిందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారించి, అతనిపై కేసు కూడా నమోదు చేయడం జరిగిందన్నారు. ఆ సర్టిఫికెట్ ను రద్దు చేయుటకు జిల్లా కలెక్టర్‌కి సిఫారసు చేయడం జరిగిందన్నారు. మండల ప్రజలు దళారులను నమ్మి మోస పోవద్దు అని తెలిపారు.

పదోవ తరగతి పరిక్ష కేంద్రాలను పరిశీలించిన డిఇఒ

కోట,మార్చి 19 ప్రభాతవార్త : కోట మండలంలో జరుగుతున్న పదోవ తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోటజిల్లా పరిషత్ బాలురు,బాలికల అంబేద్కర్ గురుకులం, చిట్టేడు కేంద్రాలను ఆయన నిశితంగా పరిశీలించారు. కాగ డిఇఒ ఈ కేంద్రాల గురించి కొందరు సమాచారం ఇచ్చారనే అందు వల్లే ఆయన తనిఖీ చేశారని ప్రచారం కూడా జరుగుతుంది. అనంతరం ఆయన కోట ఎంఇఒ కార్యాలయాంలో పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఇఒ డి.మస్తానయ్య ఉన్నారు.

మున్సిపాల్టీ అభివృద్ధికి సహకరించండి : చేర్మేన్

నాయుడుపేట, మార్చి 19 ప్రభాతవార్త : నాయుడుపేట మున్సిపాల్టి అభివృద్ధికి కౌన్సిలర్లు అందరు కలిసి సహకరించాలని మున్సిపాల్టి చెర్మేన్ కటకం దీపిక తెలిపారు. ఆమె ఆధ్యక్షతన బధవారం నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ భవనంలో మున్సిపాల్టి కౌన్సిలర్లు సాదారణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపాల్టి చెర్మేన్ కటకం దీపిక మాట్లడుతూ మున్సిపాల్టీ అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలన్నారు. నాయుడుపేట పట్టణంలో ముఖ్యంగా విన్నమాల కాలువ పూడికతీత, తాగునీరు సమస్యలు తలెత్తకుండా ముందస్తూ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పట్టణంలో డ్రైనేజి పూడికతీత చేపటడం ద్వార దోమలు నివారణ,పారిశుద్యం మెరుగుపడు తుందన్నారు. అనంతరం 18అంశాలతో కూడిన అజెండాను అధికారులు సమావేశంలో కౌన్సిలర్లు ముందుంచి అమోదం పొందారు. నాయుడుపేట పట్టణంలోని పలువార్డుల్లో నెలకొనివున్న సమస్యలను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేసి మున్సిపాల్టిని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.ఈసమావేశంలో మున్సిపాల్టి వైస్‌చేర్మేన్ 786రపి,జలదంకి వెంకటక్రిష్ణరెడ్డి, కమిషనర్‌పజులుల్లా,అధికారులు,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మండే కాలం... వైద్య శాఖ సన్నద్ధం

కోట,మార్చి 19 ప్రభాతవార్త : వేసవి రావడంతో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ సారి ఎండలు తీవ్రత అధికంగా ఉంటుందని వాతావారణ శాఖ ఇప్పటికే హెచ్చరిచింది. ఈ ప్రభావం ప్రధానంగా వృద్దులు,గర్భిణులు, చిన్న పిల్లలపై ఎక్కువగా ఉంటుంది, ఈ నేపద్యంలో రానున్న మూడు మాసాల ఆరోగ్య పరంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా వైద్య ఆరోగ్య శాఖ సన్నద్దమవువతోంది. ఇందుకు సంబంధించి వైద్యులు, సిబ్బంది,కి అధికారులు ఆదేశాలిచ్చారు. కార్యాచరణ రూపొందించుకుని వెంటనే అమలు చేయాలని సూచించారు.

గ్రామాల్లోకి ఓఆర్ఎస్ ప్యాకెట్లు :

ఇప్పటి వరకు పీహెచ్‌సీ,ఆరోగ్య ఉప కేంద్రాల స్థాయిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుతున్నారు. ఇకపై వీటిని గ్రామ స్థాయిలోనూ అంఉదుబాటులో ఉంచాలని నిర్నయించారు. ఆశా మిడ్లఎవల్ హెల్త్ ప్రోవైడర్ వద్ద ఉంచి అవసరమైన వారికి అందచేస్తారు. ఇప్పటికే అన్ని పీమెచ్‌సీలకు ఒఆర్ఎస్ పంపిణీ చేశారు. సెల్లెన్లు, మందులు నాలుగు నెలలకు సరిపోయేలా ఆసుపత్రులకు అందిస్తారు. ప్రజలు వడదెబ్బ బారిని పడకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలో తాగునీటి వనరులు సురక్షింగా ఉన్నాయో లేదా పరిశీలిస్తారు. అవసరాన్ని బట్టి క్లోరినేషన్ చేపడతారు

మంచినీళ్లు ఎక్కువగా తీసుకొవాలి:

వేసవి నేపధ్యంలో ప్రజలు తమ పనులును ఉదయం 10 గంటల లోపే సాయంత్రం 5 గంటలపైన చేసుకొవాలని చిట్టేడు ఆరోగ్య ఉప కేంద్రం డాక్టర్ నాగరాజు సూచించారు. ప్రధానంగా పశువుల,గోర్రెల కాపురాలు ఎండలో నిత్యం ఉంటారని అటువంటి వారు గోడుగులు తీసుకేళ్లాలని, ఎక్కవగా మంచి నీళ్లు తీసుకొవాలని ఆయన సూచించారు.మజ్జిగఆలసట, నీరంసంగా ఉంటే వేంటనే వైద్యులను సప్రదించాలని సూచించారు.

రవాణా శాఖ మంత్రిని సన్మానిస్తున్న విజయ్‌బాబు

పుత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త : రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి, చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అయిన మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు బుధవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. ఆయన ఆయురారోగ్యాలతో మరిన్ని జన్మదినోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

చిత్తూరులో మాస్టర్ ప్లాన్ అమలు

- రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

- కట్టమంచి వద్ద రోడ్ల విస్తరణకు మున్సిపల్ కమీషనర్, ఎసిపిలు మార్కింగ్

చిత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త:జిల్లా కేంద్రం చిత్తూరులో రోడ్లను విస్తరించి మాస్టర్ ప్లాన్ అమలు చేయడానికి మున్సిపల్ కార్పొరేషన్ సిద్ధం అయ్యింది. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు రోడ్లను విస్తరించడానికి చర్యలు తీసుకున్న అధికారులు ప్రస్తుతం చిత్తూరు-తిరుపతి రోడ్డులో కట్టమంచి వెంకుసా కళ్యాణ మండపం నుండి రైల్వే ఓవర్ బ్రిడ్జి వరకు ఏ మేరకు రోడ్డు విస్తరించాలనే విషయంపై బుధవారం మార్కింగ్ చేశారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, ఎసిపి నాగేంద్రలు, సర్వేయర్లు వెంకుసా కళ్యాణ మండపం నుండి కట్టమంచి రైల్వే బ్రిడ్జి వరకు ఏ మేరకు రోడ్డు విస్తరణ పనులు చేయాలి! ఇందులో ఎంత వరకు వర్తకులు, నివాసాలు తొలగించాల్సి వస్తుందనే విషయంపై సర్వే నిర్వహించారు. చిత్తూరు నగర పరిధిలోని ప్రధాన రోడ్లను విస్తరించాలని పదేళ్ళ నుండి భావిస్తున్నారు. పదేళ్ళ నుండి రోడ్ల విస్తరణ కార్యక్రమం చేపట్టినప్పటికీ విస్తరణలో నివాసాలు, షాపులు, స్థలాలు కోల్పోయే యాజమానులు వ్యతిరేకించడం, కొంతమంది కోర్టులను ఆశ్రయించడంతో ఈ పనులు మందకోడి అయ్యాయి. ఈ క్రమంలో చిత్తూరు నగర పరిధిలోని ప్రధాన రహదారులను 100 అడుగుల మేరకు వెడల్పు చేయాలని నిర్ణయించిన మున్సిపల్ కార్పొరేషన్ అందుకు అనుగుణంగా ప్రస్తుతం ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తోంది. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, ఎసిపి నాగేంద్రలు చిత్తూరులో మురకంబట్టు నుండి కలెక్టరేట్ వరకు సుమారు 8.1 కిమీ మేరకు రోడ్డును 100 అడుగుల మేరకు విస్తరించడానికి చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గిరింపేట దుర్గమ్మ గుడి నుండి కలెక్టరేట్ వరకు రోడ్లు విస్తరణ పనులు పూర్తయ్యాయి.అలాగే ప్రభుత్వ భవనాలు వున్న జడ్పీ కార్యాలయం పరిసరాల్లో సైతం కొంత మేరకు రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. అలాగే దేవస్థానం, వక్ఫ్‌బోర్డులకు సంబంధించి హైరోడ్డులో కొంత స్థలం రోడ్డు విస్తరణకు ఇవ్వడానికి ఆ సంస్థలు అంగీకరించడంతో అక్కడ సైతం రోడ్డు విస్తరణ సమస్య క్లియర్ అయ్యింది. అలాగే చిత్తూరు జిల్లా కోర్టు పరిసరాల్లో రోడ్డు విస్తరించడానికి హైకోర్టు నుండి గ్రీన్ సిగ్నల్ లభించడంతో ఆ మేరకు ఇక్కడ సైతం సమస్య పరిష్కారం అయ్యింది. ప్రస్తుతం కట్టమంచి వెంకుస కళ్యాణ మండపం నుండి రైల్వే బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరించడానికి పూనుకొని మున్సిపల్ అధికారులు విజయవంతం అయితే ఆపై హైరోడ్డులోని పాత బస్టాండ్ పరిసరాలు, ఎంఎస్ఆర్ సర్కిల్ పరిసరాల వరకు రోడ్డు విస్తరణకు పూనుకుంటే మురకంబట్టు నుండి కలెక్టరేట్ వరకు 100 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం కల సకారం కానుంది.

మండలంలో ఆగని ఇసుకాసురుల ఆగడాలు..

-ప్రశ్నించిన మున్సిపల్ కమీషనర్‌పై దౌర్జన్యం..!

పలమనేరు,మార్చి 19 ప్రభాతవార్త: పలమనేరు మండలంలో ఇసుకాసురుల ఆగడాలు రోజురోజుకు మితిమీరి పోతుంది.కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుక పాలసీని అమలు చేయడంతో నదీ తీరంలోని ఇసుకను అక్రమార్కులు దోచేస్తున్నారు.ఇప్పటికే కౌండిన్య నది నుండి ఇసుకను పూర్తిగా ఇసుకాసురులు కాజేయడం ఇందుకు నిదర్శనం.వేసవి కాలం దృశ్య ముందస్తు చర్యలలో భాగంగా బుధవారం పలమనేరు మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి పట్టణంలోని నాగమంగళం వద్ద ఉన్న వాటర్ పంప్ హౌస్‌ను తనిఖీ చేశారు.ఈ క్రమంలో మున్సిపాలటీకి నీటిని సరఫరా చేసే పంప్ హౌస్ సమీపంలో కొందరు అక్రమార్కులు ఇసుకను అక్రమంగా తోడేస్తున్న విషయాన్ని గమనించిన కమీషనర్ వారిని ప్రశ్నించగా వారు కమీషనర్‌పై దౌర్జన్యం చేస్తు దురుసుగా వ్యవహరించారు.దీంతో కమీషనర్ పలమనేరు సిఐ నరసింహరాజు కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం : కమీషనర్

- వార్త ప్రభావం

పలమనేరు,మార్చి 19 ప్రభాతవార్త: ఈ నెల 18న ప్రభాతవార్తలో పలమనేరు మున్సిపాలటీకి నీటి సమస్య తప్పదా.. అన్న కథనంపై మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి స్పందించారు. బుధవారం ఆయన పలమనేరులో ఉన్న మున్సిపల్ బోర్లను,పంప్ హౌసులను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని బోర్ల నుండి నీరు సరఫరా చేస్తున్నారు..ఎన్ని బోర్లు మరమత్తులు చేపట్టాలని సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు.ఈ మేరకు నాగమంగళం మున్సిపల్ వాటర్ పంప్‌హౌస్ బోర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని గత 3 సంవత్సరాలుగా పలమనేరులో వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో వైఎస్ఆర్ జలాశయం పూర్తిగా అడుగంటి పోయిందని,పట్టణంలో సుమారు 80 బోర్ల నుండి నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నామని అందులో నీరు తక్కువగా వస్తున్న బోర్లను గుర్తించి మరమత్తులు చేస్తున్నామని తెలిపారు.ప్రజలు నీటిని వృధా చేయకూడదని సూచించారు.సరఫరా చేస్తున్న నీటిని ఎవరైన వృధా చేస్తే వారి నీటి కనెక్షన్‌లను తొలగిస్తామని హెచ్చరించారు.

సమస్యల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

-జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

ఐరాల, మార్చి 19 ప్రభాతవార్త: ప్రజల నుండి అందిన రెవెన్యూ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఈవిషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ జి.విద్యాధరి విఆర్వోలను హెచ్చరించారు.బుధవారం మండల తహశీల్దార్ కార్యాలయంలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె విఆర్ఓలు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలు, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారంకు సంభందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను సిద్ధం చేయాలని సకాలంలో పరిష్కా రానికి తహశీల్దార్ సహకరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో కాలయాపన తగదని ఈవిష యంలో ఎటువంటి అలసత్వం వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ సేవలను పారదర్శ కంగా ప్రజలకు అందజేయాలన్నారు. అర్జీల సమస్యల పరిష్కారానికి సంభందించి ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా ప్రజల స్పందన తెలుసుకోవడం జరుగుతోందని ఈసందర్భంగా ప్రజల నుండి ఎటువంటి నెగటివ్ ఫీడ్‌బ్యాక్ వచ్చినా అందకు సంభందించి పూర్తి వివరాలతో జిల్లాలలకు పంపడం జరుగు తుందన్నారు. అలాగే కార్యాలయం ఆవరణలో పచ్చదనంప పెంపునకు చర్యలు చేపట్టాలని విద్యాధరి సూచించారు. ఈసమావేశంలో తహశీల్దార్ మహేష్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

ఇంటి, కుళాయి పన్నులను చెల్లించండి

కమిషనర్ మంజునాథ్ గౌడ్